లద్నూర్ పాలకేంద్రంలో గోల్‌మాల్

- లక్షల రూపాయలు మాయమైనట్లు రైతుల ఆరోపణ
- వివాదాలకు కేంద్ర బిందువుగా విజయ పాలకేంద్రం

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 23 : మండలంలోని లద్నూర్‌లో విజయ పాలకేంద్రం ఇటీవల వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. గ్రామంలోని రైతులు కల్తీపాలు పోస్తున్నారని అధికారులు ఆరోపించి పాలను నేలపాలు చేసి, పాల సేకరణను నిలిపివేశారు. దీంతో ఆగ్రహానికి గురైన పాడి రైతులు గతేడాది డిసెంబర్ 31న పాల కేంద్రంలో విజయ డెయిరీ అధికారులను నిర్బంధించారు. ఈ ఘటనను మరిచిపోకముందే పాల కేంద్రంలో తాజాగా అవినీతి జరిగిందని, లెక్కలన్నీ తప్పులతడకగా ఉన్నాయని పాడి రైతులు ఆరోపిస్తున్నారు. పాలకేంద్రానికి సంబంధించిన ఆదాయ, వ్యయాలపై సమగ్రంగా విచారణ చేపట్టాలని విజయ డెయిరీ ఉన్నతాధికారులకు పాడి రైతులు ఫిర్యాదు చేశారు. గతేడాది జూన్ మాసం వరకు పాల కేంద్రానికి సంబంధించిన డబ్బులు రూ.4 లక్షలు నిల్వ ఉన్నట్లు పాలకవర్గం చూపింది. ప్రస్తుతం పాలకేంద్రంలో ఎలాంటి డబ్బులు నిల్వలేవని చేతులెత్తేయడంతో రైతులు మండిపడుతున్నారు. రైతుల ఫిర్యాదు మేరకు విజయ డెయిరీ చేర్యాల మేనేజర్ మురళి రెండ్రోజుల క్రితం పాలకేంద్రంలో ప్రాథమికంగా విచారణ చేపట్టి రూ.లక్షా 30 వేలు లెక్కల్లో వ్యత్యాసం వస్తున్నట్లు గుర్తించారు. సుమారు రెండేండ్ల నుంచి పాలకేంద్రాల్లో అధికారులు ఆడిట్ చేయకపోవడంతో కొంతమంది పాలకేంద్రాల్లో చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తున్నది. వివిధ గ్రామాల్లోని విజయ డెయిరీ పాల కేంద్రాల్లో ఉన్నతాధికారుల అండదండలతో అవినీతి జరుగుతున్నదని పాడి రైతులు ఆరోపిస్తున్నారు. పాలకేంద్రాల్లో జరుగుతున్న అవినీతిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై చేర్యాల విజయ డెయిరీ పాలకేంద్రం మేనేజర్ మురళిని 'నమస్తే తెలంగాణ' ఫోన్‌లో వివరణ కోరగా, లద్నూర్ పాలకేంద్రంపై వచ్చిన ఆరోపణల మేరకు విచారణ చేపట్టగా, లెక్కల్లో రూ.లక్షా 30 వేలు తేడా వస్తున్నట్లు తెలిపారు.

కుదిరిన ఒప్పందం



ఒప్పంద పత్రాలతో వీసీ నీరజాప్రభాకర్

ములుగు, జనవరి 23 : కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం సిద్దిపేట, కట్టన్‌గుర్ ఫార్మర్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్ నల్గొండకు చెందిన సంస్థల పరస్పర సహకారానికి ఒప్పందం కుదిరింది. మంగళవారం మండల కేంద్రం ములుగులోని తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయంలోని అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో వీసీ డాక్టర్ నీరజాప్రభాకర్ ఆధ్వర్యంలో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి ప్రతులను రెండు సంస్థల అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్, డీన్ ఆఫ్ హార్టికల్చర్ కంట్రోలర్ కిరణ్‌కుమార్, డీన్ ఆఫ్ పీజీ స్టూడెంట్స్ రాజశేఖర్ పాల్గొన్నారు.

'పట్నం' వారం ఆదాయం రూ.70.22 లక్షలు

చేర్యాల, జనవరి 23: కొమురవెల్లి మల్లికార్జునస్వామి పట్నం వారం సందర్భంగా రూ.70, 22,307 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో బాలాజీ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అర్జిత సేవలు, గదులు, దర్శనాలు, ప్రసాదాల విక్రయం ద్వారా శనివారం రూ.11,84,726, ఆదివారం రూ.47,82,420, సోమవారం రూ.10,55,161 ఆదాయం వచ్చిందన్నారు. గతేడాది పట్నం వారానికి రూ.49,83,819 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. ఈ ఉత్సవాల సందర్భంగా స్వామివారి ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో ఈనెల 25న హుండీలను లెక్కించనున్నట్లు తెలిపారు. హుండీలను ఓపెన్ చేసి భక్తులు స్వామివారికి సమర్పించిన నగదు, బంగారు, వెండి కానుకలు లెక్కించనున్నామని చెప్పారు. మొక్కుల రూపంలో వచ్చిన బియ్యం, పసుపు తూకం వేస్తామన్నారు. ఆలయ ఏఈవో గంగా శ్రీనివాస్, సూపరింటెండెంట్ నీల శేఖర్, ఆలయ ప్రధాన అర్చకుడు మహాదేవుని మల్లికార్జున్, అర్చకులు, ఒగ్గు పూజారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'మనోచేతన' సేవలు భేష్

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, జనవరి 23 : మానసిక దివ్యాంగుల్లో మనోస్థైర్యం కల్పిస్తున్న మనోచేతన స్వచ్ఛంద సంస్థ సేవలు హర్షణీయమని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని మనోచేతన సంస్థ ఆధ్వర్యంలో దాత ఇప్ప నిషికాంత్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే దివ్యాంగులకు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో జీవించేందుకు కేసీఆర్ నెలనెలా రూ.3 వేల పింఛన్ ఇచ్చి వారి బతుకుల్లో వెలుగులు నింపినట్లు తెలిపారు. దివ్యాంగులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి అన్ని సౌకర్యాలు, వసతులు కల్పించాలన్నారు. సమాజంలోని అన్నివర్గాల ప్రజలు దివ్యాంగులతో ప్రేమగా మెలగాలని కోరారు. దశాబ్దాలుగా చేర్యాల ప్రాంతంలో మనోచేతన సంస్థ దివ్యాంగుల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలు మరిచిపోలేనివన్నారు. మనోచేతన సంస్థకు అన్ని విధాలుగా సహకరిస్తానని హామీ ఇచ్చారు.

దివ్యాంగులకు దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ఎమ్మెల్యేను కలిసిన మున్సిపల్ పాలకవర్గం

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని కలిసిన దుబ్బాక మున్సిపల్ పాలకవర్గ సభ్యులు

దుబ్బాక, జనవరి 23 : ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మంగళవారం దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి ఆధ్వర్యంలో వైస్ చైర్‌పర్సన్ సుగుణాబాలకిషన్ గౌడ్, పలువురు కౌన్సిలర్లు కలిశారు. ఈ సందర్భంగా దుబ్బాక పట్టణాభివృద్ధిపై చర్చించారు. అనంతరం వైస్ చైర్‌పర్సన్ సుగుణ కుమారుడి వివాహ వేడుకకు హాజరుకావాలని ఎమ్మెల్యేకు పెండ్లి పత్రిక అందజేశారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో కౌన్సిలర్లు ఆసయాదగిరి, మూర్తి సంధ్యాశ్రీనివాస్‌రెడ్డి, గోనె పల్లి దేవలక్ష్మీసంజీవ్‌రెడ్డి, పులిగారి కల్పనా ఎల్లం, బట్టు ఎల్లం ఉన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు

సిద్దిపేట, జనవరి 23 : పిల్లల్లో పోషకాహార లోపం కారణంగా రక్తహీనత సమస్య ఏర్పడుతుందని డీఎంహెచ్‌వో డాక్టర్ కాశీనాథ్ అన్నారు. మంగళవారం పట్టణంలో బీఆర్ఎస్‌కే టీమ్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పాఠశాలల్లో 8, 9, 10,11,12 తరగతుల విద్యార్థులకు రక్తహీనత నిర్ధారణ కోసం ఈనెల 24 నుంచి స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం 43 రోజులపాటు కొనసాగుతుందన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ చైల్డ్ హెల్త్ డాక్టర్ విజయరాణి మాట్లాడుతూ రక్తహీనత నిర్ధారణ పరీక్షలకు అవసరమైన 39,000 కిట్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. బీఆర్ఎస్‌కే టీమ్స్ ద్వారా ప్రతిరోజు 100 మంది విద్యార్థుల చొప్పున రక్తహీనత నిర్ధారణ పరీక్షలు చేస్తామన్నారు. సమావేశంలో పీహెచ్‌ఎంహెచ్‌ఎం డాక్టర్ రజిని, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ప్రభాకర్, డీఐఈవో సూర్యప్రకాశ్, అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్‌బీఎస్‌కే నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్‌రాజు, బీఆర్ఎస్‌కే టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

సమయాన్ని వృథా చేయొద్దు

మాట్లాడుతున్న ఏసీపీ రమేశ్

గజ్వేల్, జనవరి 23 : సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి ప్రణాళికతో చదవాలని ఏసీపీ రమేశ్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం మహతి ఆడిటోరియంలో ఇన్‌స్పైర్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మోటివేషన్ క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, అధ్యాపకులు చెప్పే ప్రతి అంశాన్ని విద్యార్థులు జాగ్రత్తగా వినాలని చెప్పారు. పోటీ ప్రపంచంలో ప్రతిఒక్కరూ మనస్సు పెట్టి చదివితేనే మంచి స్థాయికి చేరుకుంటారన్నారు. సెల్‌ఫోన్‌కు తక్కువ, పుస్తకాలకు ఎక్కువ సమయం కేటాయించిన వారు సక్సెస్ అవుతారన్నారు. సెల్‌ఫోన్‌ను వినియోగించి అనుకున్న రంగాల్లో రాణించినవారు కూడా ఉన్నారని తెలిపారు. అంతకుముందు సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నటుడు కేవీ ప్రదీప్, గోటేని నలిని, ఫౌండేషన్ అధ్యక్షుడు గోపాల్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్లను రిలీవ్ చేయాలి

జగదేవ్‌పూర్, జనవరి 23 : బదిలీలు, ప్రమోషన్ల విషయంలో ప్రభుత్వం చొరవ చూపి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్లను రిలీవ్ చేయాలని టీఎస్‌యూటీఫ్ జిల్లా కార్యదర్శి వెంకట్‌కిరణ్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో యూటీఎఫ్ నూతన మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా తీగల్ జడ్పీ హెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు శివుడు, ప్రధాన కార్యదర్శిగా రాజనర్సుతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ప్రవీణ్, కుమార్, సమత, లక్ష్మీపతి, సుభాషిని, భిక్షపతి, రమేశ్, నర్మద, రాజేశ్, మంజుల, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాపర్ల సమస్యలు పరిష్కరించాలి

దుబ్బాక, జనవరి 23 : ఉపాధిలేక ఫొటోగ్రాపర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర నాయకులు పల్లె వెంకట్, శంకర్, దేవరాజ్ కోరారు. మంగళవారం దుబ్బాకలో విలేకరులతో మాట్లాడారు. ఫొటోగ్రాఫర్లకు సమయపాలన, సరైన వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్ధరాత్రి వరకు పనిలో ఉండడంతో అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని చెప్పారు. రోడ్డు ప్రమాదాలకు గురై పలువురు ఫొటోగ్రాపర్లు మృతి చెందారని తెలిపారు. ఫొటోగ్రాపర్ల సంక్షేమానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో 30 మండలాల ఫొటోగ్రాపర్లు పాల్గొన్నారు.

'మల్లన్న'ను దర్శించుకున్న ఎర్రోళ్ల శ్రీనివాస్

మల్లన్న క్షేత్రంలో ఎర్రోళ్ల శ్రీనివాస్

చేర్యాల, జనవరి 23 : కొమురవెల్లి మల్లికార్జునస్వామిని మంగళవారం టీఎస్ఎంఎస్ఐడీసీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎర్రోళ్ల శ్రీనివాస్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లికార్జునస్వామి వారి ఆశీస్సులతో రానున్న ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘనవిజయం సాధించడం ఖాయమన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకుడు ఏర్పుల మహేశ్ ఉన్నారు.

499 గ్రామాల్లో వికసిత్ భారత్ యాత్ర పూర్తి

సిద్దిపేట అర్బన్, జనవరి 23: జిల్లాలోని 499 గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పూర్తయిందని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యజిత్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. నేటి నుంచి మున్సిపాలిటీల్లో వికసిత్ భారత్ సంకల్ప కొనసాగుతుందన్నారు. ఈ యాత్రలో జిల్లాలో ఇప్పటివరకు 1,18,079 మంది పాల్గొన్నారని, ఇందులో 2,597 కొత్త ఉజ్వల రిజిస్ట్రేషన్లు, 33 ఆయుష్మాన్ భారత్ కార్డులు, 6,063 మంది సురక్షా బీమా, 4,689 మంది జీవన జ్యోతి బీమా యోజన కింద నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గజ్వేల్, జనవరి 23 : భారత రాజ్యాంగంపై విద్యార్థులకు అవగాహన ఉండాలని కోరుతూ మంగళవారం మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బెజుగామలో డీబీఎఫ్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఎగొండస్వామి మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమలై 74 ఏండ్లు అయిన సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. రాజ్యాంగం గురించి విద్యార్థులకు ఉపాధ్యాయులు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి వేణు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు సోషల్ మీడియా వారియర్స్ సమావేశం

హుస్నాబాద్, జనవరి 23 : కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ సమావేశానికి కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కరీంనగర్‌లోని రేకుర్తిలోని రాజశ్రీ కన్వెన్షన్ హాల్‌లో ఈనెల 24న(బుధవారం) ఉదయం 10 గంటల సోషల్ మీడియా వారియర్స్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నారని చెప్పారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని సోషల్ మీడియా ఇన్‌చార్జిలు విధిగా సమావేశానికి హాజరుకావాలన్నారు. భవిష్యత్ ప్రణాళిక, పార్లమెంటు ఎన్నికల్లో ఎలా ముందుకుపోవాలో కేటీఆర్ దిశానిర్దేశం చేస్తారని తెలిపారు.

పాఠశాల భవనం ప్రారంభం

కొమురవెల్లి, జనవరి 23: 'మనఊరు - మనబడి'లో భాగంగా మండలంలోని ఐనాపూర్‌లో రూ.60 లక్షలతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల గదులను మంగళవారం సర్పంచ్ చెరుకు రమణారెడ్డి, వైస్ ఎంపీపీ రాజేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), జనవరి 23 : అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి గ్రామానికి చెందిన బొల్లు బాలవ్వ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మంగళవారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకుడు బోయ శ్రీనివాస్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్, నర్సింహులు ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శులుగా బాధ్యతల స్వీకరణ

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 23 : మద్దూరు మండలంలోని మూడు గ్రామాలకు పంచాయతీ కార్యదర్శులను నియమిస్తూ మంగళవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మర్మాముల గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న రేణుకను కొన్ని రోజుల క్రితం మిరుదొడ్డి మండలం కాసులాబాద్‌కు డిప్యుటేషన్‌పై బదిలీ చేయగా, తిరిగి ఆమెను తన పూర్వస్థానమైన మర్మాముల పంచాయతీ కార్యదర్శిగా పంపించారు. కమలాయపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన స్నేహ సెలవులు ముగియడంతో ప్రభుత్వం తిరిగి కమలాయపల్లి పంచాయతీ కార్యదర్శిగా పంపించారు. గాగిళ్లాపూర్ పంచాయతీ కార్యదర్శిగా రాయపోల్ మండలం టెంకంపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి రజియా డిప్యుటేషన్‌పై వచ్చారు. కాగా, ముగ్గురు పంచాయతీ కార్యదర్శులు బాధ్యతలు స్వీకరించారు.

'భూదాత' కల్వకోట సురేందర్‌రావు మృతి

సురేందర్‌రావు (ఫైల్)

చేర్యాల, జనవరి 23: పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించేందుకు 30 ఎకరాల సొంత భూమిని విరాళంగా అందజేసిన భూదాత కల్వకోట సురేందర్‌రావు (79) సోమవారం రాత్రి మృతి చెందారు. పట్టణంలోని ఎంపీడీవో, ఎంఈవో, ఇంటిగ్రేటెడ్ బీసీ వసతి గృహం, జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆర్టీసీ బస్‌స్టేషన్‌కు భూమి ఇవ్వడంతో సంబంధిత అధికారులు అక్కడ నిర్మాణాలు చేపట్టారు. ప్రభుత్వ కార్యాలయాలకే కాకుండా దేవాలయాలు, పేదలకు సురేందర్‌రావు తన భూమిని విరాళంగా అందజేశారు. ఆయనకు భార్య అరుంధతిదేవి, కుమారులు కాంతికృష్ణ, రాజేశ్వర్‌రావు, సంగీతసాయి ఉన్నారు. పట్టణవాసులు ప్రేమగా పెద్దదొరగా పిలుచుకునే సురేందర్‌రావు మృతితో వివిధ పార్టీల నాయకులు, అధికారులు, వ్యాపార, వాణిజ్యవర్గాలు సంతాపం వ్యక్తం చేశాయి. ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణిశ్రీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం, ఎంపీపీ బద్ది పడిగె కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్, రామగల్ల పరమేశ్వర్, సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, గ్రామ కార్యదర్శుల సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి ఉపేందర్‌రావు, సీహెచ్ కృష్ణాజీరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

గజ్వేల్, జనవరి 23 : పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి నివాసంలో మంగళవారం విద్యుత్ ఉద్యోగుల సంఘం(ఐఎన్‌టీయూసీ) క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సర్దార్‌ఖాన్, మల్లారెడ్డి, కుమార్, అజ్గర్, మతిన్ తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

సిద్దిపేట అర్బన్, జనవరి 23 : తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ -2024 డైరీ, క్యాలెండర్‌ను సిద్దిపేట కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి, తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ చైర్మన్ శివప్రసాద్, వ్యవసాయ సహాయ సంచాలకుడు అనిల్, రాధిక, అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, జిల్లా కోశాధికారి పరశురామ్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, సీపీ అనురాధ

సిద్దిపేట, జనవరి 23: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మైదానంలో వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధతో కలిసి సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానాన్ని ఆయన సందర్శించారు. పోలీస్ పరేడ్, జాతీయ జెండా ఆవిష్కరణ, ప్రొటోకాల్, కల్చరల్ ప్రోగ్రామ్స్ తదితర అంశాల గురించి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఆయన వెంట అడిషనల్ డీసీపీ అడ్మిన్ అందె శ్రీనివాసరావు, ఏఆర్ అడిషనల్ డీసీపీలు రామచంద్రరావు, సుభాష్‌చంద్రబోస్, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, సిద్దిపేట ఆర్డీవో రమేశ్‌బాబు, ఏసీపీ సురేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఎస్ఈ మహేశ్, ఐఅండ్‌పీఆర్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ తిరుపతినాయక్, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ కృష్ణారెడ్డి, ఇన్స్పెక్టర్ సురేందర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు పూర్ణచందర్, ధరణికుమార్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ప్రేరణ తరగతులు

సిద్దిపేట, జనవరి 23 : పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు పూర్తిస్థాయిలో ప్రిపేర్ కావాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. మంగళవారం బీసీ వెల్ఫేర్ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బీసీ వసతి గృహాల్లో 10వ తరగతి విద్యనభ్యసిస్తున్న 184 మంది విద్యార్థులకు ప్రేరణ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ హాజరై మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పిన విధంగా విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్స్ అందిస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు చేతిరాతపై నిపుణులు ఎజాజ్ అహ్మద్ శిక్షణ ఇచ్చారు. బీసీ కార్పొరేషన్ అధికారి సరోజ, శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ గోపాల్, సుదర్శన్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాతృ మరణాలు జరగొద్దు

సిద్దిపేట అర్బన్, జనవరి 23 : ఇక నుంచి ఎలాంటి మాతృ మరణాలు సంభవించకుండా నివారణ చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో గత సంవత్సర కాలంలో జిల్లాలో జరిగిన నాలుగు మాతృ మరణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సిద్దిపేట జనరల్ దవాఖాన, గజ్వేల్ జిల్లా దవాఖానలో రేడియాలజిస్ట్ అందుబాటులో ఉంటూ 24 గంటల స్కానింగ్ సౌకర్యం ఉండేలా చూసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కాశీనాథ్ పాల్గొన్నారు.

యువత ముందుకు రావాలి

సిద్దిపేట అర్బన్, జనవరి 23 : ఎయిర్ ఫోర్స్‌లో అగ్నివీర్ వాయుగా ఎంపిక కోసం యువత ముందుకు రావాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ వింగ్ ప్రతినిధులు, జిల్లా యువజన, క్రీడల అధికారి నాగేందర్‌తో కలిసి అగ్ని వీర్ వాయు కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. అంతకుముందు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎయిర్ ఫోర్స్ వింగ్ ప్రతినిధులు సందర్శించి విద్యార్థులకు అగ్ని వీర్ వాయుపై అవగాహన కల్పించారు.

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

కొమురవెల్లి, జనవరి 23 : కొండపోచమ్మ దర్శనం కోసం వచ్చిన వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన మండలంలోని గురువన్నపేట శివారులో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా తాండూరు మండలంలోని సిర్సవాడకు చెందిన పెదింటి బలరామ్ తన కుటుంబ సభ్యులతో కలిసి కొమురవెల్లి జాతరకు వచ్చారు. ఆదివారం మల్లన్నను దర్శించుకున్న బలరామ్ కుటుంబ సభ్యులు కొండపోచమ్మను దర్శించుకునేందుకు వెళ్లారు. కొండపోచమ్మ దర్శనం చేసుకొని గురువన్నపేట శివారులోని ఎల్లమ్మ ఆలయం వెనక భాగం పార్కింగ్ స్థలంలో బలరామ్ పడుకున్నాడు. సోమవారం రాత్రి 11. 30 గంటల సమయంలో ఓ వ్యక్తి కారు రివర్స్ చేస్తూ నిద్రిస్తున్న బలరామ్‌కి ఎక్కించడంతో అక్కడికక్కడే అతడు మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్రీశైలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రేపు ఎమ్మెల్యే పర్యటన

తొగుట, జనవరి 23 : తొగుట మండల కేంద్రంలో బుధవారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పర్యటించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌తో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తారని తెలిపారు.

ఈఎస్ఎంఎస్ యాప్‌పై అవగాహన

సిద్దిపేట అర్బన్, జనవరి 23 : ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఈఎస్ఎంఎస్) యాప్‌పై కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో దక్షిణాది రాష్ట్రాల చీఫ్ ఎలక్షన్ కమిషనర్లు, ఆయా జిల్లాల ఎన్నికల అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం అవగాహన కల్పించారు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఈఎస్ఎంఎస్ యాప్ డౌన్‌లోడ్, లాగిన్ అయ్యే విధానంపై వివరించారు. ఎన్నికల సందర్భంగా డబ్బు, మద్యం పంపిణీ, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే సామగ్రిని అధికారులు స్వాధీనం చేసుకొని ఆ వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేసే విధానం, వాహనాలను తనిఖీ చేసే పద్ధతిపై వివరించారు. వీడియో కాన్